సాక్షి
నిజామాబాద్
మంగళవారం । 26 । సెప్టెంబర్ । 2023



సీన్ రీకన్‌స్ట్రక్షన్

యువతిపై దాడి , హత్యాయత్నం ఘటనలో పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేశారు. సీన్ రీ కన్‌స్ట్రక్షన్ నిర్వహించారు.

- 8లో ▸



గంజాయి పట్టివేత

రూ.50 లక్షల విలువ చేసే ఎండు గంజాయిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
30.7 /22.5

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. ఓ మోస్తరునుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

నేడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి రాక

సుభాష్‌నగర్: నగరంలోని బస్వాగార్డెన్‌లో మంగళవారం జరిగే బీజేపీ జిల్లా పదాధికారుల సమావేశానికి ముఖ్యఅతిథులుగా కేంద్ర మంత్రి, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి కిషన్‌రెడ్డి, ఎంపీ అర్వింద్ హాజరుకానున్నారు. బీజేపీ రాష్ట్ర పదాధికారులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,జిల్లా పదాధికారులు, మోర్చాల అధ్యక్షులు, పదాధికారులు,రాష్ట్ర నాయకులు, అసెంబ్లీ కన్వీనర్లు,కోకన్వీనర్లు, మండల ఇన్‌చార్జులు, మండల అధ్యక్షులు, కార్పొరేటర్లు హాజరై విజయవంతం చేయాలని పార్టీజిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య కోరారు.

విధుల్లో చేరిన పీజీహెచ్‌ఎంలు

నిజామాబాద్‌అర్బన్: జిల్లా విద్యాశాఖ పరిధిలోని పీజీ హెచ్‌ఎంలు పదోన్నతి పొందిన విధుల్లో చేరారు. జిల్లా వ్యాప్తంగా 88 పీజీ హెచ్‌ఎం పోస్టుల్లో జిల్లాలోని 58 మంది పదోన్నతి పొందగా, ఇతర జిల్లాల నుంచి 30 మంది వచ్చారు.

జీజీహెచ్‌లో అవయవదాన కార్యక్రమం



ఖలీల్‌వాడి: అవయదానం ద్వారా మనిషిని బతికించవచ్చునని, ప్రతి ఒకరు అవయవాలు దానం చేయాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో జీజీహెచ్‌లో అవయదానం నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్య సిబ్బంది, ఆస్పత్రి సిబ్బంది, ఇతరులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. 115 మంది అవయవ దానం కోసం నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

ఈ–కేవైసీకి డిసెంబర్ వరకు గడువు

సుభాష్‌నగర్: రేషన్‌కార్డు, ఆహారభద్రతా కార్డులో కుటుంబ సభ్యులు ఈ–కేవైసీ తీసుకునేందుకు గడువు డిసెంబర్ వరకు ఉందని జిల్లా పౌరసరఫరాల అధికారి చంద్రప్రకాశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీలర్లు దుకాణాలు తెరవకపోవడంతో అనేక మంది కార్డుదారుల నుంచి ఫిర్యాదులు వచ్చాయన్నారు. మీ సేవలో కూడా చాలా మంది కార్డుదారులు ఈ–కేవైసీ కోసం క్యూలు కడుతున్నారన్నారు. రేషన్‌కార్డుల ఈ–కేవైసీ ఈనెల చివరి వరకు మాత్రమే గడువు ఉందని తప్పుడు సమాచారం ఇస్తున్నారన్నారు. మొదటగా రేషన్‌కార్డులోని కుటుంబ సభ్యులు ఈ–కేవైసీ రేషన్ దుకాణాల్లో మాత్రమే నమోదు చేయించుకోవాలని సూచించారు. ఎవరైనా కుటుంబ సభ్యుల బయోమెట్రిక్ రాకుంటే వారు మాత్రమే మీ సేవకు వెళ్లాలని పేర్కొన్నారు. ఈవిషయంలో డీలర్లపై ఏమైనా ఫిర్యాదులు వస్తే కఠినచర్యలు తీసుకుంటామని డీఎస్‌వో చంద్రప్రకాశ్ హెచ్చరించారు.



ర్యాలీలో పాల్గొన్న ప్రజలు, కార్యకర్తలు

బీఆర్‌ఎస్ ఘనతే

- కాంగ్రెస్ అధికారంలోకి రావడం పగటి కలే
- తెలంగాణలో అన్ని వర్గాలు బాగుపడాలన్నదే సీఎం కేసీఆర్ స్వప్నం
- బీఆర్‌ఎస్ మళ్లీ గెలవడం ఖాయం
- స్పష్టం చేసిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- నగరంలో బీఆర్‌ఎస్ భారీ ర్యాలీ


కృతజ్ఞత సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్యే గణేశ్ గుప్తా తదితరులు

నిజామాబాద్‌నాగారం: పార్లమెంట్‌లో మహిళా బిల్లు ఆమోదం పొంది ప్రపంచంలో ఇతర దేశాల సరసన భారతదేశం నిలబడిందంటే అందుకు బీఆర్‌ఎస్ పార్టీయే కారణమని ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు. ఈ బిల్లు పై కాంగ్రెస్ పార్టీ కూడా తప్పనిసరిగా మాట్లాడే పరిస్థితిని బీఆర్‌ఎస్ తీసుకొచ్చిందన్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లును తక్షణమే అమలు చేయాలన్నారు. ఓబీసీ మహిళలకు కూడా రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు మాట్లాడుతోందన్నారు. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల సాధన తర్వాత తొలిసారి సోమవారం నిజామాబాదుకు వచ్చిన కల్వకుంట్ల కవితకు బీఆర్‌ఎస్ కార్యకర్తలు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా ఆధ్వర్యంలో నగరంలోని ఐటీఐ గ్రౌండ్ నుంచి కలెక్టర్ గ్రౌండ్ వరకు భారీ ర్యాలీ జరిగింది. బోర్గాం పి నుంచి వర్ని చౌరస్తా వరకు బైక్ ర్యాలీ సాగింది. అనంతరం కలెక్టరేట్‌లో నిర్వహించిన కృతజ్ఞత సభలో కవిత మాట్లాడుతూ.. తెలంగాణ అభివృద్ధి పథంలో ముందుకు సాగితే అన్ని వర్గాలు బాగుపడతాయనేది సీఎం కేసీఆర్ స్వప్నమని స్పష్టం చేశారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం అని తేల్చి చెప్పారు. గత పదేళ్లుగా తెలంగాణలో బీఆర్‌ఎస్ పాలనలో ఒక్క మతకల్లోలం జరగలేదని, ఒక చిన్న గొడవ కూడా జరగలేదని అన్నారు. దేశంలో ఎటువంటి పరిస్థితులు ఉన్నా తెలంగాణలో మాత్రం శాంతిభద్రతలు సజావుగా ఉన్నాయి కాబట్టే రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు వస్తున్నాయని, తద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు కలుగుతున్నాయని వివరించారు. అభివృద్ధి ఒకటే కాదని ప్రజలకు ఆత్మగౌరవం ఉండాలన్న ఆలోచన తమ పార్టీదన్నారు. అందుకే సీఎం కేసీఆర్ అనేక పథకాలను అమలు చేస్తున్నారని వివరించారు. బీడీ కార్మికులకు పెన్షన్ ఇచ్చే ఏకైక రాష్ట్రం తెలంగాణ అని, దేశంలో ఎక్కడా లేనివిధంగా మార్కెట్ కమిటీల పదవుల్లో మహిళలకు సీఎం కేసీఆర్ అవకాశం కల్పించారని చెప్పారు. బీఆర్‌ఎస్ ఇవన్నీ చేస్తుంటే ఏమీ చేయని కాంగ్రెస్ పార్టీ వచ్చి తామే అధికారంలోకి వస్తామని అంటుంటే నవ్వాలో ఏడవాలో అర్థం కావడం లేదన్నారు.

పసుపు బోర్డుపై స్పష్టత ఇవ్వాలి

తెలంగాణకు వచ్చే ముందు ప్రధాని మోదీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కాళేశ్వరానికి జాతీయ హోదా, నిజామాబాదులో పసుపు బోర్డు , బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ విభజన చట్టంలో ఇచ్చిన హామీలపై నిర్ణయాన్ని ప్రకటించాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌కు అధికారంలోకి రావాలన్న కల తప్ప.. అభివృద్ధి కానే కాదని అన్నారు. ఓబీసీ మహిళలకు కూడా రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు మాట్లాడుతోందన్నారు. 20 ఏళ్ల కింద కాంగ్రెస్‌కు తెలివి ఉంటే అప్పుడే బీసీ,ఎస్సీ,ఎస్టీ మహిళలకు న్యాయం జరిగేదన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని రాహుల్ గాంధీ అనడం హాస్యాస్పందంగా ఉందన్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం తన స్వప్నమని సోనియాగాంధీ అన్నారని, అయితే అధికారంలోకి రావడం స్వప్నం ఉండవద్దని కవిత అన్నారు. తెలంగాణ దళితులు, మైనారిటీలు, బలహీన వర్గాలు, మహిళలు, యువకులు మరింత అభివృద్ధి చెందాలన్న స్వప్నం ఉండాలని సోనియాగాంధీ రాహుల్ గాంధీకి సూచించాలన్నారు.

ఎమ్మెల్యే గణేశ్ గుప్తా అద్భుతంగా పనిచేస్తున్నారని, ఆయనను మరొకసారి భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు పిలుపు నిచ్చారు.

కవిత సహకారంతో మళ్లీ గెలుస్తా

మహిళా శక్తి దేశ్‌కి శక్తి అని, మహిళ రిజర్వేషన్‌ల కోసం పోరాడిన వీర నారి ఎమ్మెల్సీ కవిత అని కొనియాడారు. అందుకే నగరంలో 15000 మందితో ఆశీర్వాద కృతజ్ఞత ర్యాలీ తీశామన్నారు. మహిళ బిల్లు కార్యరూపం దాలిస్తే 33 శాతం మహిళలు చట్ట సభల్లో అడుగుపెడతారన్నారు. ఎమ్మెల్సీ కవిత సహకారంతో మళ్లీ గెలుస్తానని, ప్రజల ఆశీర్వాదం ఇలాగే ఉండాలని కోరారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతు కిరణ్, జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు , ఆకుల లలిత, మాజీ మేయర్ ఆకుల సుజాత ,రెడ్కో మాజీ చైర్మన్ అలీం కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.


ఆశీర్వాద ర్యాలీలో భారీ గజమాలతో కవితకు సన్మానం

సర్వే గుబులు..!

- ప్రజాప్రతినిధుల పనితీరుపై..
- గతంలో పాజిటివ్‌గా ఇంటెలిజెన్స్ రిపోర్టు
- వ్యతిరేకంగా వచ్చిన ప్రయివేట్ ఏజెన్సీల నివేదిక
- దీంతో జంబ్లింగ్ విధానంలో ప్రజాభిప్రాయం సేకరణ
- మళ్లీ రంగంలోకి దిగిన ఇంటెలిజెన్స్ వర్గాలు



ఖలీల్‌వాడి: ఇంటెలిజెన్స్, ప్రయివేట్ ఏజెన్సీలతో గులాబీ బాస్ సర్వేలు చేయించడంతో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధుల్లో గుబులు రేపుతోంది. ఇప్పటికే జిల్లా ఇంటెలిజెన్స్ వర్గాలతో సర్వేలు చేయించినట్లు సమాచారం. జిల్లా ఇంటెలిజెన్స్ వర్గాలు ఇచ్చిన సర్వే నియోజకవర్గాల ప్రజాప్రతినిధులకు అనుకూలంగా ఉన్నట్లు అధికారిక వర్గాల సమాచారం. అయితే ఇటీవల ప్రవేటు ఏజెన్సీలతో నిర్వహించిన సర్వేలో క్షేత్రస్థాయిలో నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులకు వ్యతిరేకంగా ఉండటంతో.. జంబ్లింగ్ విధానంలో ఇంటెలిజెన్స్ వర్గాలతో సర్వే చేయిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాకు చెందిన ఇంటెలిజెన్స్ వర్గాలు ఇతర జిల్లాకు వెళ్లగా, ఇతర జిల్లాలకు చెందిన ఇంటెలిజెన్స్ వర్గాలు ఇప్పటికే జిల్లాలో సర్వే చేస్తున్నట్లు చర్చ సాగుతోంది. ఈ సర్వే నివేదికల తర్వాతే నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధుల పనితీరుపై స్పష్టత వస్తుందని అధినేత భావిస్తున్నట్లు తెలుస్తోంది.

మెప్పు కోసమే..

అధినేత మెప్పు కోసమే పాజిటివ్ రిపోర్ట్ జిల్లా ఇంటిలిజెన్స్ అధికారులు ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో మళ్లీ ప్రయివేట్ ఏజెన్సీలతో జిల్లాలో సర్వే నిర్వహించారు. ఏజెన్సీలు గ్రామాల వారీగా, పట్టణాలలో కాలనీల్లో ఇంటింటికి తిరుగుతూ సర్వే చేశాయి. నెల రోజుల క్రితం ఇచ్చిన సర్వే రిపోర్టులను గులాబీ పార్టీకి అందజేసినట్లు తెలిసింది. రిపోర్టులో నియోజక వర్గ స్థాయి ప్రజాప్రతినిధులపై ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తం కావడంతో.. ఈసారి జంబ్లింగ్ పద్ధతిలో ఇంటెలిజెన్స్ వర్గాల ద్వారా సర్వే చేయిస్తున్నట్లు సమాచారం. ఈ సర్వేలు ఏ విధంగా వెళ్తున్నాయో తెలుసుకునేందుకు ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో తమకు అనుకూలంగా ఉన్న వారి నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నట్లు సమాచారం. మరోవైపు ఈ సర్వేలు గులాబీపార్టీలో చర్చనీయాంశమైంది.

జిల్లాకు ఇతర జిల్లాల ఇంటెలిజెన్స్ వర్గాలు..

జిల్లాలో ఇప్పటికే గ్రామాల వారీగా ఉన్న కులసంఘాల వివరాలను జిల్లా ఇంటెలిజెన్స్ వర్గాలు తీసుకున్నాయి. కుల సంఘాలలో గల వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల వివరాలను, సెల్‌ఫోన్ నంబర్లను, కుల సంఘాలలో ఎవరితో ఏ పని జరుగుతుందనే అంశాలను సేకరించారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పనితీరుతో పాటు ప్రజాప్రతినిధుల పనితీరుకు సంబంధించిన అంశాలనూ ఆరా తీస్తున్నట్లు తెలిసింది. ప్రజాప్రతినిధులకు ప్రజలతో గల సత్సంబధాలు, ప్రభుత్వ పథకాలు ఏ మేరకు అందుతున్నాయి. ప్రజాప్రతినిధి అందుబాటులో ఉంటున్నారా ? కోణంలో ఇంటెలిజెన్స్ వర్గాలు క్షేత్రస్థాయిలో పరిశీలించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. తెలంగాణలో ఉన్న ఇంటెలిజెన్స్ అధికారులను జంబ్లింగ్ పద్ధతిలో జిల్లాలకు పంపించి నియోజకవర్గ పరిస్థితులపై నివేదికను తీసుకోనున్నట్లు తెలిసింది.

ప్రభుత్వ భూమి కబ్జాపై ఇంటెలిజెన్స్ ఆరా

- ప్రజావాణిలో ఫిర్యాదులు
- కలెక్టర్ చొరవ చూపాలని వినతులు

నిజామాబాద్‌నాగారం: ప్రభుత్వ భూమి కబ్జాపై ఇంటెలిజెన్సు వర్గాలు ఆరా తీశాయి. 'సాక్షి'లో ఈ నెల 25న ప్రచురితమైన 'దర్గాగా కబ్జా' కథనానికి స్పందించి ఇంటెలిజెన్స్ వర్గాలు రంగంలోకి దిగాయి. జిల్లా కేంద్రంలోని ఖిల్లా ప్రాంతంలో సర్వే నంబర్ 2545, 3258లో 28 ఎకరాలు సుమారు రూ. 100 కోట్ల విలువ చేసే భూమిని అక్రమార్కులు కబ్జా చేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుడు, ఎంఐఎం నాయకులతో కలిసి అధికారుల ప్రమేయంతో రికార్డులు సృష్టించినట్లు తెలుస్తోంది. రికార్డుల్లో ఉన్న ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు చెందినదిగా మార్చేశారు. ప్రస్తుతం ఈ భూమిలో ఇప్పటికే అక్రమ నిర్మాణాలు వెలిశాయి.దీనిపై ఎవరి పాత్ర ఎంత మేర ఉందో తెలుసుకోడానికి ఇంటెలిజెన్సు వర్గాలు ప్రత్యేకంగా ఆరా తీయడం మొదలు పెట్టాయి. క్షుణ్ణంగా వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు సమాచారం.

అధికారులు పట్టించుకోవడం లేదు..



ప్రభుత్వ భూమి కబ్జాపై ప్రజావాణిలో కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకులు సయ్యద్‌ఖైసర్ మరోసారి రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. గతంలో ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోలేదన్నారు. ఇరిగేషన్ అధికారులు కావాలనే నిర్లక్ష్యం చేస్తున్నారని వినతిలో విన్నవించారు.

ప్రభుత్వ భూమిని రక్షించాలి

నగరంలోని ఖిల్లా ప్రాంతంలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని ఆక్రమణలు తొలగించి రక్షించాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డు గంగాధర్ జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో విన్నవించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో ప్రభుత్వ భూములను రక్షించాలన్నారు.

నకిలీ ధ్రువపత్రాలు ఆగేనా..!

- ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల్లో వెలుగు చూసిన వ్యవహారం
- రెండోసారి 105 మంది టీచర్లను వైద్య పరీక్షలకు పంపిన డీఈవో

నిజామాబాద్‌అర్బన్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి కొంతమంది ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలు నకిలీవి సమర్పించినట్లు ఫిర్యాదులు రావడంతో జిల్లా విద్యాశాఖ ఆరోగ్య ధ్రువీకరణ పత్రాల కోసం రెండోసారి పరిశీలనకు పంపింది. ఈ మేరకు సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ 105 మంది ఉపాధ్యాయులకు ఉత్తర్వులు జారీ చేశారు. ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలను ఉపాధ్యాయులు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పతి నుంచి తీసుకుంటారు. అయితే ఇక్కడి నుంచే నకిలీ ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలు జారీ అవుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఆస్పత్రిలో కొందరు వైద్యులను మచ్చిక చేసుకుని కొంతమంది ఈ నకిలీ ధ్రువీకరణ పత్రాలను పొందుతున్నట్లు తెలుస్తోంది. జనవరిలో ప్రభుత్వ ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులను విద్యాశాఖ చేపట్టింది. ఇందుకుగాను అర్హులైన ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారు.

పదోన్నతి తిరస్కరించినా..

రెండోసారి పదోన్నతి తిరస్కరించిన ఉపాధ్యాయులను మూడోసారి పదోన్నతికి సంబంధించి అనర్హులుగా నిబంధనలు ఉన్నాయి. కాగా జిల్లాలో 60 మంది టీచర్లు రెండోసారి పదోన్నతి తిరస్కరించిన వారు సైతం సీనియార్టీ జాబితాలో ఉన్నారు. ఈ మేరకు శనివారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన విద్యాశాఖ ఆదేశాలు జారీ చేయడంతో కొందరు ఉపాధ్యాయులు ఆందోళన చెంది డిక్లరేషన్ ఇచ్చారు. ఇలా 51 మంది రెండోసారి పదోన్నతి తిర్కరించినట్లు తెలిపారు.

ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన ఓ టీచర్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నుంచి తనకు నరాల సమస్య ఉందని, ఆపరేషన్ కూడా అయిందని ఇటీవల బదిలీలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్నాడు. ఓ ఉపాధ్యాయ సంఘం దీనిపై ఫిర్యాదు చేయగా జిల్లా విద్యాశాఖ అధికారులు ఈ వైద్య ధ్రువీకరణ పత్రాన్ని పరిశీలించాలని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి అధికారులకు వద్దకు వెళ్లారు. పరిశీలించిన వైద్యులు ఇతనికి భవిష్యత్తులో సర్జరీ అవసరం ఉంటుందని, ప్రస్తుతం సర్జరీ జరగలేదంటూ మరో సర్టిఫికెట్ ఇచ్చారు. మొదట సర్జరీ అయిందంటూ తర్వాత భవిష్యత్తులో అవసరం ఉన్నట్టు ఇలా రెండు విధాలుగా వైద్య ధ్రువీకరణ పత్రం అందించారు. ఇలా ఎందరో మంది నకిలీ ధ్రువీకరణ పత్రాలను సమర్పించినట్లు ఆరోపణలు ఉన్నాయి.


జిల్లా విద్యాశాఖలో టీచర్ల బదిలీలు చేపడుతున్న అధికారులు

నకిలీ సర్టిఫికెట్‌లను తొలగించాలి

స్కూల్ అసిస్టెంట్ కేటగిరిలో ఒకరి న్యూరో సర్జన్ నకిలీ సర్టిఫికెట్ విషయం తెలియగానే డీఈవో దృష్టికి తీసుకెళ్లాము. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మరోసారి పరిశీలన చేయించగా అతనికి ఇప్పుడు సర్జరీ అవసరం లేదని, భవిష్యత్తులో అవసరం ఉంటుందని తేల్చారు. సదరు ఉపాధ్యాయుని పేరు ప్రిఫరెన్షియల్ కేటగిరి నుంచి తొలగించారు. ఇంకా ఇలాంటి వారు ఉండడానికి అవకాశం ఉండొచ్చు. నకిలీ ధ్రువీకరణ పత్రాలను పూర్తిగా తొలగించాలి. – ఎ.సత్యానంద్, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

ఎన్నికల ఏర్పాట్ల వేగం పెంచాలి

- ఈనెల 27లోగా ఓటరు నమోదు, మార్పులు–చేర్పులు పూర్తి చేయాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ నిర్దేశం


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు

సుభాష్‌నగర్: ఎన్నికల ఏర్పాట్లను మరింత ముమ్మరం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. సోమవారం జిల్లా కలెక్టర్లు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన ఎన్నికల నిర్వహణ అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. ఓటరు నమోదు, మార్పులు–చేర్పులకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలన, తుది ఓటరు జాబితా రూపకల్పన, పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల గుర్తింపు, నామినేషన్ల స్వీకరణ, పోలింగ్ సామగ్రి పంపిణీ, కౌంటింగ్ కేంద్రాలు, ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది నియామకం, భద్రతాపరమైన ఏర్పాట్లపై జిల్లా సీఈవో మార్గనిర్దేశం చేశారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తుల పరిశీలన, పరిష్కారాలను ఈనెల 27లోగా పూర్తిచేయాలని గడువు విధించారు. ఈవిషయమై కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు స్పందిస్తూ ఎస్‌ఎస్‌ఆర్‌లో భాగంగా 2023 జులై 16 నుంచి మొదలుకుని తుది గడువు వరకు జిల్లాలో మొత్తం 86,444 దరఖాస్తులు రాగా, వాటిని వెంటనే పరిష్కరించామని పెండింగ్‌లో ఉన్న 13వేల దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని సీఈఓ దృష్టికి తెచ్చారు. నిజామాబాద్ అర్బన్ సెగ్మెంట్ పరిధిలో పెండింగ్ దరఖాస్తులు ఎక్కువ సంఖ్యలో ఉన్నందున అదనపు సిబ్బందిని నియమించి అప్‌లోడ్ చేయిస్తున్నామన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో తప్పనిసరిగా మహిళా ఓటర్ల కోసం ఐదు పోలింగ్ కేంద్రాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని, అలాగే యువ ఓటర్లు, దివ్యాంగుల కోసం ఒక పోలింగ్ కేంద్రం ఉండేలా చూడాలని సీఈఓ సూచించారు. ఈఆర్‌ఓల స్థాయిలో ప్రతి వారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలని, వారి నుంచి వచ్చే అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. సెక్టోరల్ అధికారుల ద్వారా సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల జాబితాను సేకరించాలని, అలాంటి పోలింగ్ స్టేషన్లలో వెబ్ కాస్టింగ్ జరిగేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని జిల్లా ఎన్నికల అధికారి, ఈఆర్‌ఓల స్థాయిలో నియమించుకోవాలని అనుమతించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, పి యాదిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఎం మకరంద్, నోడల్ అధికారి సింహాచలం, ఈఆర్‌ఓలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి

- సీపీ సత్యనారాయణ

ఖలీల్‌వాడి: ఈనెల 28న గణేశ్ నిమజ్జనం, మిలాద్ ఉన్ నబీ పండుగలు జరుగనున్న నేపథ్యంలో ప్రశాంతంగా, శాంతియుతంగా జరుపుకోవాలని సీపీ సత్యనారాయణ ఒక ప్రకటనలో కోరారు. రెండు పండగలు ఒకే రోజు ఉండటంతో శాంతికమిటీ సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సమావేశాల్లో ఎక్కడ కూడా, ఎలాంటి అల్లర్లు జరుగకుండా, ఎవరి మనోభావాలు దెబ్బతినకుండా ప్రవర్తించాలని సూచించారు. మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల లోపు నిర్వహించాలని, గణేశ్ నిమజ్జనం కార్యక్రమాలను మధ్యాహ్నం 12 గంటల నుంచి ప్రారంభించాలని స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్ల పరిధిలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, సీసీ కెమెరాల ద్వారా సంబంధిత పోలీస్ స్టేషన్ సిబ్బంది పర్యవేక్షిస్తారన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా కూడా ప్రత్యేకంగా సిబ్బంది వీక్షిస్తారన్నారు. ఎవరైనా అల్లర్లకు పాల్పడేందుకు ప్రయత్నిస్తే కనిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

క్లుప్తంగా

ప్రజావాణికి 150 ఫిర్యాదులు



సుభాష్‌నగర్: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 150 ఫిర్యాదులు అందాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్య లను వివరిస్తూ కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, జడ్పీ సీఈవో గోవింద్, డీఆర్డీవో చందర్, డీపీవో జయసుధకు అర్జీలు సమర్పించారు.

ఎస్సారెస్పీలోకి తగ్గిన వరద

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద తగ్గుముఖం పట్టింది. దీంతో గేట్ల ద్వారా దిగువకు నీటివిడుదలను అధికారులు నిలిపివేశారు. ప్రస్తుతం ఎగువ ప్రాంతాల నుంచి 22 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా, కాకతీయ కాలువ ద్వారా 6 వేల క్యూసెక్కులు, వరద కాలువ ద్వారా 15 వేలు, సరస్వతీ కాలువ ద్వారా 300 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తుండగా, ఆవిరిరూపంలో 666 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు) అడుగులు కాగా, పూర్తిస్థాయి నీటిమట్టం కలిగి ఉంది.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిరసన

తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పని చేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ యూనివర్సిటీ అవుట్‌సోర్సింగ్ సిబ్బంది సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. డిచ్‌పల్లి మెయిన్ క్యాంపస్‌తోపాటు భిక్కనూర్ సౌత్ క్యాంపస్, సారంగాపూర్ ఎడ్యుకేషన్ క్యాంపస్‌లో అవుట్‌సోర్సింగ్ సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. సీఎం కేసీఆర్ గతంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలనిడిమాండ్ చేశారు.

జిల్లాలో అక్కడక్కడ వర్షం

సుభాష్‌నగర్: జిల్లాలోని పలు మండలాల్లో గడిచిన 24 గంటల్లో అక్కడక్కడ వర్షం కురిసింది. ఇప్పటికే అధిక వర్షపాతం నమోదు కాగా, తాజాగా కురిసిన వర్షానికి వాగులు, వంకలు, అలుగులు పొంగిపొర్లుతున్నాయి. మంగళవారం సైతం జిల్లాలో అక్కడక్కడా మోస్తారు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

వర్షపాతం వివరాలు..

నవీపేట్ 19.3 మి.మీ., డొంకేశ్వర్ 11.5, మాక్లూర్ 15.3, నందిపేట్ 20.5, రెంజల్ 18.1, పోతంగల్ 10.3, కోటగిరి 10.7, వర్ని 14.2, బోధన్ 16.2, సాలూరా 19.5, రుద్రూరు 22.2, ఎడపల్లి 25.5, మోపాల్ 14.9, నిజామాబాద్‌రూరల్ 17.7,చందూర్ 14.1, మోస్రా 15.4, నిజామాబా ద్‌సౌత్ 20.3 మి.మీ. వర్షపాతం నమోదైంది.

సెల్ఫీ విత్ గణేశ్..



పర్యావరణాన్ని కాపాడే రీతిలో ప్రత్యేక ఆకృతుల్లో అపార్ట్‌మెంట్ కమ్యూనిటీ, యువజన సంఘాల మండపాలు, ఇళ్లలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలకు సంబంధించి 'సాక్షి' సెల్ఫీలు ఆహ్వానిస్తోంది. ఆసక్తిగలవారు వినాయక ప్రతిమలతో సెల్ఫీలు దిగి కింది నంబరుకు వాట్సాప్ చేయగలరు.

పంపించాల్సిన వాట్సాప్ నెం.
8978036828


ఓం గణేశ్ మండలి, శ్రీజనప్రియనగర్, ముబారక్‌నగర్


బ్యాంక్ కాలనీ గణేశ్ మండలి


ఉమ, బోధన్


లింగంయాదవ్ - బోధన్


బాలహనుమాన్ గణేశ్, నిజామాబాద్


జర్నలిస్టు కాలనీ గణేశ్ మండలి


చిన్నారెడ్డి, రెంజర్ల


గంగపుత్ర సంఘం, బ్రాహ్మణ్‌పల్లి


రాజ్‌కుమార్- సిర్‌పూర్, నందిపేట మండలం


యోగేశ్వర బాలల గణేశ్‌మండలి, యోగేశ్వర కాలనీ, వినాయక్‌నగర్


ప్రేమ్‌లాల్, వినాయక్ నగర్, నిజామాబాద్


శంకర్, సోని


రాహుల్, గాదేపల్లి


పుల్లె మహేశ్, మోస్రా


నవీన్‌చారి, మైలారం


భక్త హిందూయూత్ గణేశ్ మండలి, వర్ని చౌరస్తా


బజరంగ్ యూత్ -హమాల్‌వాడి


రుూన్సీ -మామిడిపల్లి, ఆర్మూర్


మామిడిపల్లి, ఆర్మూర్

ప్రజల సౌకర్యార్థం పీఆర్ సబ్‌డివిజన్ కార్యాలయం

- రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి, ఇందల్వాయి మండలాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్ల సౌకర్యార్థం డిచ్‌పల్లి మండల కేంద్రంలో పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ సబ్ డివిజన్ కార్యాలయాన్ని ప్రారంభించినట్లు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. డిచ్‌పల్లి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన పీఆర్ సబ్‌డివిజన్ కార్యాలయాన్ని బాజిరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఆర్ సబ్‌డివిజన్ కార్యాలయం ఏర్పాటుకు సహకరించిన సీఎం కేసీఆర్, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. పంచాయతీరాజ్ పనుల నిమిత్తం గతంలో జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేదని, ఇక నుంచి డిచ్‌పల్లి, ఇందల్వాయి మండలాల ప్రజలు సబ్‌డివిజన్ కార్యాలయంలో పనులు పూర్తి


సబ్‌డివిజన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, పీఆర్ ఎస్ఈ ప్రభాకర్, డీఈఈ శంకర్‌రాథోడ్, జడ్పీటీసీ దాసరి ఇందిరా లక్ష్మీనర్సయ్య, ఎంపీడీవో టీవీఎస్‌గోపీబాబు, పీఆర్ఏఈ శ్రీధర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చింత శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నారాయణరెడ్డి, మోహన్ రెడ్డి, శక్కరికొండ కృష్ణ, సాయిలు, అమీర్, యూసుఫ్, నర్సయ్య, నయీం, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

నిఘా నీడలో గణేశ్ మండపాలు

- నిమజ్జనానికి పటిష్టమైన బందోబస్తు
- పోలీస్ కమిషనర్ సత్యనారాయణ


సీపీ సత్యనారాయణ

ఖలీల్‌వాడి: కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలోని గణేశ్ మండపాలపై పోలీసు నిఘా వ్యవస్థ పటిష్టంగా కొనసాగుతున్నదని సీపీ వి.సత్యనారాయణ తెలిపారు. కమిషనరేట్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 5405 గణేశ్ విగ్రహాలను ఏర్పాటు చేయగా, నిజామాబాద్ డివిజన్ పరిధిలో 2502, ఆర్మూర్ పరిధిలో 1955, బోధన్ పరిధిలో 948 విగ్రహాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. గణేశ్‌మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. బ్లూకోల్ట్స్, పెట్రోకార్‌సిబ్బంది ప్రతిరోజూ మూడుపర్యాయాలు మండపాలను సందర్శిస్తున్నారన్నారు. గణేశ్ నిమజ్జనానికి సీసీ కెమెరాల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రధానరూట్లలో 100 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిఘా సారిస్తున్నామన్నారు. కెమెరాలు పూర్తిగా పోలీస్ కమిషనర్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశామని, 24 గంటల పోలీసుల పర్యావేక్షణలో ఉంటాయని తెలిపారు.

బీసీలకు రెండు సీట్లు కేటాయించాలి



ఆర్మూర్/ఖలీల్‌వాడి: నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో రెండు అసెంబ్లీ టికెట్లను బీసీలకు కేటాయించాలని టీపీసీసీ ఇన్‌చార్జిని ఆర్మూర్‌నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు గోర్త రాజేందర్ కోరారు. ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో ఠాక్రేను రాజేందర్ సోమవారం కలిశారు. ఆర్మూర్ పరిధిలో బీసీల శాతం వివరాలను ఠాక్రే దృష్టికి తీసుకెళ్లిన రాజేందర్ తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఠాక్రే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు రాజేందర్ తెలిపారు.

సైక్లింగ్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా విజయ్‌కాంత్‌రావు



నిజామాబాద్‌నాగారం: సైక్లింగ్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా భూలోకం విజయ్‌కాంత్ రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో సోమవారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. విజయ్‌కాంత్‌రావు ఎన్నికపై ఒలింపిక్ సంఘం అధ్యక్షు డు ఈగ సంజీవ రెడ్డి, కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, సైక్లింగ్ సంఘం అధ్యక్షుడు జీవీ కృపాకర్‌రెడ్డి,ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్ సుబేదార్, సూర్యప్రకాశ్, కోశాధికారి సురేందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాకేశ్‌కుమార్, సంయుక్త కార్యదర్శి దివాకర్, నరేశ్‌కుమార్, శరత్‌గౌడ్, దుర్గా మల్లేశ్, వినోద్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు.

యువతిపై దాడి ఘటనలో సీన్ రీకన్‌స్ట్రక్షన్

- నిందితుడిపై కిడ్నాప్, హత్యాయత్నం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు
- బాధితురాలి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న సీపీ, రూరల్ ఎమ్మెల్యే
- జక్రాన్‌పల్లిలో దళితుల ఆందోళన

జక్రాన్‌పల్లి/ఖలీల్‌వాడి : జక్రాన్‌పల్లిలో దళిత యువతిపై దాడిచేసిన యువకుడు తౌసుఫుద్దీన్‌పై పోలీసులు కిడ్నాప్, హత్యాయత్నం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. జిల్లా కేంద్ర ప్రభుత్వఆస్పత్రికి రూరల్‌ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, సీపీ సత్యనారాయణ వెళ్లి వెంటిలేటర్‌పై ఉన్న బాధితురాలి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని, రెండు టీంలు దర్యాప్తు చేస్తున్నాయని సీపీ తెలిపారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా నిందితుడికి త్వరగా శిక్షపడే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. బాధితురాలి కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడారు. ఈ ఘటనలో ఎవరినీ ఉపేక్షించేది లేదని, నిందితుడికి శిక్షపడేలా చూస్తామన్నారు. బాధితురాలికి మెరుగైన వైద్య అందించాలని సూపరింటెండెంట్ ప్రతిమారాజ్‌ను కోరారు.

జక్రాన్‌పల్లికి సీపీ..

జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో ఘటనా స్థలాన్ని సీపీ సత్యనారాయణ పరిశీలించారు. పోలీసు సిబ్బందితో కలిసి సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేశారు. నిందితుడు యువతిని మోటర్‌సైకిల్‌పై ఎక్కించుకున్నప్పుడు పడిపోయిందని చెప్పడం అనుమానాస్పదంగా ఉందన్నారు. ఏసీపీ కిరణ్‌కుమార్, డిచ్‌పల్లి సీఐ కృష్ణ బృందం ఆధ్వర్యంలో విచారణ కొనసాగుతోందని సీపీ తెలిపారు.


సీన్ రీకన్‌స్ట్రక్షన్ నిర్వహిస్తున్న సీపీ సత్యనారాయణ

రెండు గంటల పాటు ఆందోళన..

దళిత యువతిపై దాడికి పాల్పడిన యువకుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ దళిత సంఘాల ఆధ్వర్యంలో జక్రాన్‌పల్లిలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. రెండు గంటల ధర్నా కొనసాగింది. అంబేద్కర్ చౌరస్తా నుంచి జాతీయ రహదారి వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం బస్టాండ్ ప్రాంతంలో ధర్నా చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులతో వాగ్వాదం చోటుచేసుకుంది. ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ధర్నా చేస్తున్నవారి వద్దకు చేరుకొని మాట్లాడారు. నిందితుడికి శిక్షపడేలా చూస్తామని, బాధితురాలికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. నిందితుడిని ఉరితీయాలని ఈసందర్భంగా దళితులు డిమాండ్ చేశారు.

రూ.50 లక్షల గంజాయి పట్టివేత

- 157 కిలోలకుపైగా ఎండు గంజాయి స్వాధీనం
- ఇద్దరి అరెస్ట్, రెండు వాహనాలు స్వాధీనం

ఖలీల్‌వాడి: రూ.50 లక్షల విలువ చేసే ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కిషన్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఆయన వివరాలను వెల్లడించారు. నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్ తదితర ప్రాంతాలకు గంజాయి సరఫరా చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు రెండు రోజులు మాటు వేసి పట్టుకున్నట్లు తెలిపారు. కామారెడ్డి జిల్లా సదాశివనగర్‌కు చెందిన బానోత్ వసంత్‌రావు(46), బానోత్ ప్రవీణ్(27)ను అరెస్ట్ చేసి వారి నుంచి మహీంద్ర వాహనంతోపాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. బానోత్ వసంత్‌రావు 30 ఏండ్లుగా గంజాయి దందా చేస్తున్నట్లు తెలిపారు. నిందితులు గంజాయిని ఒరిస్సా నుంచి మహారాష్ట్రకు తీసుకువచ్చి మహారాష్ట్రలోని బోకర్ తాలుకా కేంద్రంలో గంజాయిని నిలువ చేస్తారని, వాటిని ఏజెంట్లకు రెండు నుంచి మూడు కిలోల ప్యాక్ చేసి అందిస్తారని చెప్పారు. సోమవారం 157 కిలోలకుపైగా గంజాయిని మహారాష్ట్ర నుంచి తీసుకువస్తుండగా, నిజామాబాద్‌లో పట్టుకున్నామన్నారు. నిందిలను పట్టుకునేందుకు సహకరించిన సీపీ సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. సమావేశంలో సీఐలు స్వప్న, వెంకటేశ్, ఎస్సై రామ్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ చిట్టి నారాయణ, హమీద్, ఉత్తమ్, అవినాష్, శివకుమార్, రాజన్న, ఉషన్న, శ్రీనివాస్, ప్రసాద్, విష్ణు, భోజన్న తదితరులు పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ కిషన్

క్రైం కార్నర్

పెళ్లయిన నాలుగు నెలలకే విడాకులు అడిగిన భర్త

మనస్తాపంతో భార్య ఆత్మహత్యాయత్నం

ఖలీల్‌వాడి: ప్రేమ వివాహం చేసుకున్న నాలుగు నెలలకే భర్త విడాకులు అడగడంతో భార్య మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాలు ఇలా ఉన్నాయి.. నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నీలకంఠ నగర్‌కు చెందిన మధుమిత అదే ప్రాంతానికి చెందిన సాయిశశాంక్ ప్రేమించుకున్నారు. పెద్దలు వారి పెళ్లికి నిరాకరించడంతో మే 17న ఆర్యసమాజ్‌లో పెళ్లి చేసుకున్నారు. నాలుగు నెలలకే నువ్వు నాకొద్దు విడాకులు కావాలని భర్త వేధింపులకు గురి చేశాడు. విడాకులు ఇవ్వకుంటే తనకు ఉన్న సంబంధాలతో ఏం చేయాలో చేస్తానని హెచ్చరించడంతో ఆమె మనస్తాపం చెంది పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం ప్రైవేట్ దవాఖానకు తరలించారు. ఈ విషయమై బాధితురాలు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

విద్యార్థి అదృశ్యం


బాలాజీ

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్ ఎస్సీ బాలుర హాస్టల్‌లో ఉంటూ ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థి గాయిబోడి బాలాజీ అదృశ్యమైనట్లు పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఈనెల 23వ తేదీన తోటి విద్యార్థులతో కలిసి హాస్టల్ నుంచి స్కూల్‌కు వెళ్లిన బాలాజీ, క్లాస్ టీచర్ ఫోన్ తన తల్లికి ఫోన్ చేయగా ఆమె లిఫ్ట్ చేయలేదన్నారు. స్కూల్‌ముగిసిన అనంతరం విద్యార్థులందరూ హాస్టల్‌కు వచ్చినప్పటికీ బాలాజీ రాలేదు. ఆచూకీ లభించకపోవడంతో హాస్టల్ ఇన్‌చార్జి నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. అదృశ్యమైన విద్యార్థి బాలాజీది కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం కొడిచెర్ల అని సీఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు ఒకరి మృతి

కామారెడ్డి క్రైం: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరు మృతి చెందిన ఘటన కామారెడ్డి మండలం తిమ్మక్‌పల్లిలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వంజరి చిన్న భూమయ్య (40) ఈనెల 24న గణేశ్ మండపం వద్దకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి బయటకి వెళ్ళాడు. తిరిగి రాకపోవడంతో భార్య లక్ష్మి అతడి ఆచూకీ కోసం రెండురోజులు వెతికింది. సోమవారం చెరువు వద్ద అతడి వస్తువులు కనిపించాయి. గ్రామస్తులు చెరువులోకి దిగి గాలించగా, అతడి మృతదేహం లభించింది. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

వృద్ధురాలి ప్రాణాలు కాపాడిన పోలీసులు



భైంసా: నిర్మల్ జిల్లా బాసర గోదావరిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వృద్ధురాలిని స్థానిక పోలీసులు సోమవారం కాపాడారు. నిజామాబాద్ జిల్లా బోధన్‌కు చెందిన దేవుబాయికి కళ్లు సరిగా కనిపించవు. తన ఆరోగ్య సమస్య కుటుంబీకులకు ఇబ్బందిగా మారకూడదని గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు యత్నించింది. అక్కడే ఉన్న కానిస్టేబుల్ వినాయక్, స్థానికుడు లింగన్నయాదవ్ అప్రమత్తమై వృద్ధురాలి ప్రాణాలను కాపాడి ఆమె కుటుంబీకులకు సమాచారం అందించారు. కానిస్టేబుల్‌తోపాటు స్థానికుడిని పలువురు అభినందించారు.

డాంబర్ ట్యాంకర్‌లో మృతదేహం

ఎడపల్లి(బోధన్): ఎడపల్లి మండలం జానకంపేట్ సమీపంలోని ఓ వెంచర్‌లో నిలిపిఉన్న డాంబర్ ట్యాంకర్‌లో వ్యక్తి మృతదేహం కనిపించడం కలకలం సృష్టించింది. ట్యాంకర్‌ను మూడు నెలల క్రితం వెంచర్‌లో డ్రైవర్‌నిలిపివెళ్లాడు. ఆదివారం రాత్రి ట్యాంకర్‌ను తీసుకెళ్లేందుకు రాగా, ట్యాంకర్ మూత తీసి ఉండడంతో డ్రైవర్ అందులోకి తొంగి చూశాడు. వ్యక్తి మృతదేహం కనిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి మృతదేహం భాగాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగిందా? లేక హత్యనా? అని స్థానికులు చర్చించుకుంటున్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక


రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన జట్టు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల క్రీడాకారులు ఉమ్మడి జిల్లా తరపున రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ అండర్-17 పోటీలకు ఎంపికైనట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ సతీశ్ సోమవారం తెలిపారు. బాలుర, బాలికల విభాగంలో అత్యుత్తమ ప్రతిభకనబర్చిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశామన్నారు. ఎస్‌జీఎఫ్ సెక్రటరీ నాయబ్ రసూల్, పీడీలు అతీకుల్లా, లింగం, నగేశ్ తదితరులున్నారు.

బాన్సువాడ నుంచి ఇద్దరు..

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం క్యాంపులో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలిక గురుకుల విద్యాలయానికి చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పద్మకుమారి తెలిపారు. బి.నందిని, వై.సాత్వికలు రాష్ట్రజట్టుకు ఎంపికయ్యారన్నారు. క్రీడాకారిణులను ప్రిన్సిపాల్ పద్మకుమారితోపాటు పీఈటీలు సుప్రిత, ప్రభావతి, అధ్యాపకులు అభినందించారు.